స్కెచ్

# ఖరీదైన ప్రేమ

వి. ఎన్. ఆచార్య

శాంత పార్కులో ఒక మూల బెంచీపై కూర్చుని ఆలోచిస్తోంది. చివరకి తన జీవితం ఇలా తయారవడానికి కారణాలను ఆమె చర్చించుకోవడం లేదు. అవన్నీ బరువుగావున్న తన హృదయాన్ని మరింత బాధ పెట్టగలడం తప్ప లాభం లేని విషయాలని ఆమెకు తెలుసు. కాని ఆమె మనస్సు ఆలోచించడం మానడంలేదు.

పార్కులో జనం సందడి క్రమంగా తగ్గుతూ వుంది. రేడియో సంగీతం ఆగిపోగానే ఏదో ఉపన్యాసాన్ని ప్రసారం చేస్తున్నది. శాంతమాత్రం దీర్ఘంగా ఏమీ పట్టించుకోకుండా ఆలోచిస్తున్నది.

"శాంతా! నువ్విక్కడవున్నావా? పార్కు అంతా నీ కోసం గాలించేశాను!"

శాంత ఎదురుగా వున్న వ్యక్తిని పోల్చుకుంది. అతను రాజారావు! ఒకనాడు తన హృదయాన్ని అపరిమితానందంలో ముంచేసి యవ్వనోద్రేకాన్ని రెచ్చగొట్టి తన ఆశల్ని ఎండమావులుగా మార్చేసి ఎక్కడకో చెప్పకుండా మూడు సంవత్సరాలక్రితం పారిపోయిన రాజారావు!

శాంత నిశ్చేష్టితురాలై రాజారావునుచూసింది.

"నేనే శాంతా! నీ రాజాను! నన్ను మరిచిపోయావా? అవున్లే! నన్ను మర్చిపోవడమే కాదు శపించుకుంటూ వుంటావు. అసహ్యించుకుంటూ వుంటావు. కాని శాంతా! నేను మాత్రం నిన్ను మరచిపోలేను, నా పరిస్థితుల్ని సానుభూతితో అర్థం చేసుకుని నన్ను అసహ్యించుకున్నా ఫరవాలేదు."

రాజారావు శాంత పక్కన కూచున్నాడు బెంచీమీద. శాంత ఏమీ మాట్లాడలేదు. క్షణం క్రితం అగమ్యంగా, అనిశ్చితంగా కనిపించిన తన భావిజీవితంలో తళుక్కున ఏదో ఆశ మెరిసినట్లు అనిపించింది ఆమెకు.

"నేనే శాంతా! ఇంకా నమ్మలేకుండా వున్నావా?" రాజారావు ఆవిడ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూంటే చూస్తూవుండిపోయింది.

"నిన్ననే ఇటార్సీ నుండి వచ్చాను. సరాసరి బెజవాడలో దిగి నేరుగా మీ ఇంటికి వెళ్ళాను. మీ ఇంట్లో మీవాళ్ళెవరూ లేరు. నేరుగా నీ కాలేజీ స్నేహితురాలు ఇందిరదగ్గరకి వెళ్ళాను. నాకోసం రెండేళ్ళుచూసి నువ్వు చివరకి మీ నాన్నగారి ప్రోద్బలంవల్ల సిరిపురం జమీందారుగార్ని పెళ్ళి చేసుకున్నావనీ, ఇక్కడే వున్నావనీ చెప్పింది. క్షమించు శాంతా! నిన్ను ఎంతగానో బాధ పెట్టివుంటాను. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళి చేసుకోదలచిన నాకు మాత్రం నీతోనయినా చెప్పకుండా వెళ్ళిపోవడం ఆనందం కలిగించిందనుకుంటున్నావా? కానీ అదొక విచారకరమయిన గాథ. పరిస్థితులు నన్ను లొంగదీశాయి. నాన్నగారు చిల్లి కానీ ఇవ్వడంలేదు. వూళ్ళో ఎక్కడపడ్డా అప్పులు చేశాను. నీకు తెలుసు. నువ్వు రహస్యంగా నాకు ఎంతో డబ్బు సాయం చేశావు. ఒక స్నేహితుడూ నేనూ కలిసి రహస్యంగా ఒక వ్యాపారం తలపెట్టాము. పాండిచేరీ నుండీ రహస్యంగా సిస్టువాచీలూ, సిల్కులూ తెప్పించుకునే ఏర్పాటు చేసుకున్నాము. బొంబాయి రాష్ట్రంలో వాటిని అమ్మి డబ్బు చేసుకోడానికి అక్కడ ఒక వ్యాపారస్తుడితో ఏర్పాటు చేసుకున్నాము. ఎలాగయినా దండిగా డబ్బు సంపాదించుకుని ఏదో ఒక వ్యాపారం పెట్టుకుని నిన్ను పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలనుకుని నేను కట్టుకున్న ఆశా సౌధాలే నాచేత అంత సాహసం చేయించాయి. చివరకు నీతోకూడా చెప్పకుండా వెళ్ళిపోయాను. ఈ రోజున నీవద్దకు తిరిగి రాగలిగాను. మీ బంగళాకు వెళ్ళాను. గేటువద్ద చౌకీదారు నువ్వు ఇక్కడ వున్నావని చెప్పాడు. సరాసరి ఇక్కడికి వచ్చేశాను. నిన్ను చూడగలిగాను. ఏం లాభం? నువ్వు పరాయివారి సొత్తువయిపోయావు. కాని నువ్వు ఎవర్ని పెళ్ళాడినా

కాలేజీ రోజుల్లో మన ప్రేమ ఘట్టాలను మరిచి పోలేను. ప్రపంచంలో ఎక్కడవున్నా నా హృదయాన్ని ఉత్సాహపరచి ఆనందపరిచేది నీ మూర్తి మాత్రమే!''

రాజారావు శాంత చేతుల్ని తీసుకుని తన హృదయానికి హత్తుకున్నాడు. శాంత ఏమీ అభ్యంతరం పెట్టలేదు. ఆవిడకళ్ళల్లో ఏదో ప్రాణం, ఏదో ఆశ, తళుక్కున మెరిసి ప్రకాశవంతం చేసింది.

''రాజా! ఇన్నాళ్ళకి నామీద దయకలిగిందా?'' అంటూ శాంత రాజారావు చేతుల్ని తన చెంపకు చేర్చుకుని హత్తుకుంది. ''నేను ఎంత బాధపడ్డానో తెలుసా. కనీసం ఉత్తరం అయినా రాస్తావనీ, ఏనాటికైనా తిరిగి వస్తావనీ, కాలేజీ రోజుల్లో మన ప్రేమసౌధాలను వాస్తవం చేస్తావనీ ఎంతో ఆశించిన నాకు నువ్వు చేయాల్సిన ద్రోహం ఇదేనా? చివరకు నాన్నగారి ఒత్తిడిమీద ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను. కాని ఆయన చాల మంచి వారు. సంస్కృతీపరుడు. నన్ను ఎంతో ప్రేమగా చూశారు!'' శాంత ఏమీ మాట్లాడలేక పోయింది. ఆమెకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''ఛా! అలా దుఃఖపడకూడదు. ప్రపంచంలో ప్రేమించుకున్నవారంతా పెళ్ళిళ్ళు చేసుకోగలుగుతున్నారా? మీవారు చాల మంచివారనీ, నువ్వు ఎంతో సుఖపడగలుగుతున్నావనీ ఇందిర చెప్పింది. కావలసిన డబ్బు, నిన్ను సుఖపెట్టగల భర్తను నువ్వు చేసుకున్నావు. నీ అందానికీ విజ్ఞానానికీ నువ్వు వుండాల్సిన చోటే వుంటున్నావు. నన్ను చేసుకొని ఏం సుఖపడి వుండగలవు? నా వ్యాపారం అంతా నాశనం అయిపోయింది. మా రహస్య వ్యాపారాన్ని పోలీసులు పసిగట్టారు. నా స్నేహితుణ్ణి పోలీసులు అరెస్టు చేశారు. నేనిలా తప్పించుకుని పారిపోయి వచ్చాను. ఈ కేసులో నేను తప్పించుకోగలగాలంటే చాల డబ్బు అవసరం. నాన్నగారివద్దకు వెళ్ళాను. ఆయన నేనేమయినా తనకవసరం లేదనీ, చిల్లిగానీ ఇవ్వననీ ఇంట్లోంచి తరిమివేశారు. నువ్వు జమీందారిణివి. కావలసిన డబ్బు వున్నదానివి. ఒకనాడు నిన్ను ప్రేమించిన నాకు ఆపాటి సాయం చెయ్యగలవన్న ధైర్యంతో వచ్చాను. చెప్పు శాంతా! నాకు పదివేలు అవసరం. నువ్వు ఇవ్వగలవు. ఆ మాత్రం సాయం చెయ్యవూ?''

శాంత చటుక్కున రాజారావు చేతులు విడిపించుకుని లేచి నిలబడింది.

''అయితే మళ్ళా డబ్బుకోసమే నావద్దకు వచ్చావన్న మాట! నాకు తెలుసు. నువ్వు ఎప్పుడూ డబ్బుకోసమే నన్ను ప్రేమించేవాడివి. ఏనాడు తియ్యగా మాట్లాడినా నావద్ద డబ్బు గుంజడానికే. నేను ఇవ్వను. నావద్ద లేదు!'' శాంత కోపంతో నిప్పులు కక్కింది.

రాజారావు లేచి నిలబడ్డాడు. జేబులో సిగరెట్టు తీసి వెలిగించాడు. నవ్వుతూ అన్నాడు:

''నువ్వు ఇలా ప్రవర్తించితే అందుకు చెయ్యాల్సిందేమిటో ముందుగా ఆలోచించుకునేవచ్చాను. కాలేజీ రోజుల్లో నువ్వు రాసిన ప్రేమలేఖలు నావద్ద వున్నాయి. నువ్వు డబ్బు సాయం చెయ్యకపోతే వాటిని నీ జమీందారు భర్తగారికి సమర్పించుకోక తప్పదు!''

రాజారావు విషపునవ్వు నవ్వాడు.

శాంత కళ్ళల్లో నీరు తిరుగుతూ అంది:

''నువ్వు వస్తానే నా హృదయంలోవున్న చీకటి అంతరించగలదని ఆశపడ్డాను. నా జీవితం యవ్వనంలో వృధాకాదని సంతోషపడ్డాను. నా భర్త చనిపోయాడు. మూడో రోజులయింది. నువ్వు తిరిగివస్తే ఏనాటికైనా నిన్ను మళ్ళీ పెళ్ళి చేసుకొని నా భర్త విడిచిపోయిన ఆస్తితో సుఖంగా వుండాలని అనుకున్నాను. నువ్వు వచ్చావు. కాని, నా కోసం కాదు. నా డబ్బుకోసం. డబ్బుకోసం నువ్వు ఎంత నీచత్వానికి దిగజారిపోయావో క్షణం క్రితం నిరూపించుకున్నావు. నా ప్రేమలేఖలు నీ ఇష్టం వున్నవారికి చూపించుకోవచ్చు. నా భర్త సమాధి అక్కడవుంది!'' శాంత చరచరా నడచి వెళ్ళింది.

రాజారావు నిశ్చేష్టుడై నిలిచి పోయాడు. నోట్లో సిగరెట్టు జారిపోయింది.

